

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక


రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు
ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 190 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు బుధవారం, నవంబరు 11, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



జనవరిలో సహకార ఎన్నికలు..!!

- దాదాపు రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు జరగనున్నాయి
- తద్వారా 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి...
- సీఐఐ భాగస్వామ్య సదస్సుకు మంత్రులంతా తప్పనిసరిగా హాజరుకావాలి
- ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.31 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించా...
- వీటి ద్వారా 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి..
- షెడ్యూల్ ప్రకారమే సొసైటీ, పంచాయతీ, సహకార ఎన్నికలు జరుగుతాయి
- ఎన్నికలు పూర్తికాగానే పరిపాలనను తిరిగి అభివృద్ధి మూడ్‌లోకి తీసుకెళ్లాలి
- ప్రతి కేబినెట్ సమావేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, జీఎస్‌డీపీపై చర్చించాలి
- ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో ఉండాల్సిందేనని స్పష్టం
- గతంతో పోలిస్తే కూరగాయల ధరలు కొంతమేర తగ్గాయి...
- బియ్యం ధరలు కూడా తగ్గేలా చూడాలి : ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా దాదాపు రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు జరగనున్నాయని, తద్వారా 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు మంత్రులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.31 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, వీటి ద్వారా 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వచ్చే జనవరిలో సహకార ఎన్నికలు నిర్వహిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే సొసైటీ, పంచాయతీ, సహకార ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తికాగానే పరిపాలనను తిరిగి అభివృద్ధి మూడ్‌లోకి తీసుకెళ్లాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కేబినెట్ సమావేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, జీఎస్‌డీపీపై చర్చించాలని నిర్ణయించారు. ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే కూరగాయల ధరలు కొంతమేర తగ్గాయని మంత్రులు వివరించగా.. బియ్యం ధరలు కూడా తగ్గేలా చూడాలని సీఎం సూచించారు.

ఏ హోదాకు వెళ్లినా గతాన్ని...
మర్చిపోవద్దు..!!

- మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేం
- ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దు
- రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది
- మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయి
- పదిమంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి
- శాంతిభద్రతలు క్షీణించి.. అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు
- పది మంది పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది : రేవంత్‌రెడ్డి

..2వ పేజీలో



భారత్‌పై విష ప్రచారం..
చైనా వ్లాగర్ల తీరుపై కేంద్రం
సీరియస్..!!

భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనీస్ వ్లాగర్లు సామాజిక మాధ్యమాల వేదికగా విష ప్రచారం చేయడం ఇటీవల తీవ్ర వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌లోని మురికివాడలను దిల్లీకి చెందినవి అని పేర్కొంటూ వారు చేసిన లైవ్‌స్ట్రీమింగ్‌పై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అది దురదృష్టకర ఘటన అని పేర్కొంది. అసలేం జరిగిందంటే.. ఇటీవల కొంతమంది చైనీస్ వ్లాగర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో భారత్‌లోని జీవన స్థితిగతులపై వీడియోలు పోస్ట్ చేశారు. ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చూపిస్తూ.. అవన్నీ దిల్లీ ప్రాంతాలని అసత్య ప్రచారం చేశారు. దాదాపు 150 మంది చైనీస్ జాతీయులు ఈ వీడియోలను రికార్డు చేసినట్లు సమాచారం. వీటిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ మంగళవారం మీడియా సమావేశంలో స్పందించారు. "ఈ విషయంపై మీడియాలో వచ్చిన నివేదికలను చూశాం. ఏ దేశాన్నయినా వక్రీకరించి చూపించే ఇలాంటి ప్రయత్నాలు దురదృష్టకరం. విదేశీ వ్యక్తుల సాయంతో కొంత మంది ఢాకాను దిల్లీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు అనిపిస్తోంది. అయితే, ఇలాంటి తప్పుడు

..2వ పేజీలో

డిజిటల్ అరెస్టులపై...
కన్నెర్ర..!!

సైబర్ నేరాల అడ్డుకట్టకు నివేదిక ఇవ్వండి..
సోషల్ మీడియా కంపెనీలకు సుప్రీం ఆదేశం

- డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, సైబర్ నేరాల అడ్డుకట్టకు ప్రతిపాదిత చర్యలపై నివేదిక ఇవ్వాలి
- వాట్సాప్, ఇతర సోషల్ మీడియా సంస్థలను సుప్రీంకోర్టు ఆదేశించింది
- నష్టాన్ని సదరు బ్యాంకులే భరించేలా ఆర్‌బీఐ నిబంధనలు తేవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది
- డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుమోటోగా కేసు విచారణ జరిపింది
- సైబర్ నేరాల కట్టడికి వాట్సాప్‌తో పాటు బ్యాంకులు, పోలీసు విభాగానికి కఠిన సూచనలు
- సైబర్ మోసాలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తు పురోగతి నివేదికలను సమర్పించాలి
- ఆర్‌బీఐ కొత్త కేవైసీ మార్గదర్శకాలను స్వయంగా పరిశీలిస్తామని బెంచ్ వెల్లడి

..2వ పేజీలో


డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల విషయంలో సోషల్ మీడియా సంస్థలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, సైబర్ నేరాల అడ్డుకట్టకు ప్రతిపాదిత చర్యలపై నివేదిక ఇవ్వాలని వాట్సాప్, ఇతర సోషల్ మీడియా సంస్థలను సుప్రీంకోర్టు ఆదేశించింది. తమ వద్ద ఉన్న సాంకేతిక నివారణ చర్యల వివరాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి కూడా లని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. బ్యాంకుల నిర్లక్ష్యం వల్ల ఖాతాదారులు సైబర్ ఫ్రాడ్‌లో డబ్బు పోగొట్టుకుంటే, ఆ నష్టాన్ని సదరు బ్యాంకులే భరించేలా ఆర్‌బీఐ నిబంధనలు తేవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుమోటోగా కేసు విచారణ జరిపింది. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల కట్టడికి వాట్సాప్‌తో పాటు బ్యాంకులు, పోలీసు విభాగానికి కఠిన సూచనలు చేసింది. ఖాతాదారుల సాధారణ పరిమితికి భిన్నంగా పెద్దమొత్తంలో డబ్బు బదిలీ అవుతుంటే బ్యాంకులు ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించింది. సైబర్ మోసాలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తు పురోగతి నివేదికలను సమర్పించాలని రాష్ట్రాల డీజీపీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌బీఐ



స్థానిక ఎన్నికల విజయంతో...
విర్రవీగొద్దు..!!

2029 ఎన్నికలే లక్ష్యం: సీఎం చంద్రబాబు

- ఒద్దికగా ఉండాలని.. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని వారికి సూచన
- ఇంకా చాలా జాగ్రత్తగా ఉండాలని వారిని అప్రమత్తం చేశారు
- అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేస్తున్నాం
- పలు కీలక విషయాలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఇక కూరగాయల ధరలు తగ్గాయి...
- బియ్యం ధరలు కూడా తగ్గించేందుకు ప్రయత్నం చేయాలి
- మనం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు ఉపయోగపడాలి
- పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాత సొసైటీ ఎన్నికలు ఉంటాయి
- ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత మనమంతా అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల విజయాన్ని చూసుకొని గర్వంతో విర్రవీగొద్దని మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఒద్దికగా ఉండాలని.. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని వారికి సూచించారు. ఇంకా చాలా జాగ్రత్తగా ఉండాలని వారిని అప్రమత్తం చేశారు. మనం ప్రజలకు మేలు చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేస్తున్నామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారితో చర్చించారు. పలు కీలక విషయాలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 2029 ఎన్నికలపై దృష్టి పెట్టాలని.. ఆ దిశగా అందరం పని చేయాలని అన్నారు. ఇక కూరగాయల ధరలు తగ్గాయని.. బియ్యం ధరలు కూడా తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు ధరల భారం ఉండకూడదని అన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు ఉపయోగపడాలని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాత సొసైటీ ఎన్నికలు ఉంటాయని.. అందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత మనమంతా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజార్లలో ధర తగ్గించి బియ్యం విక్రయిస్తున్నామని ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆర్నబ్, మురసు తుఫాన్ నేపథ్యంలో కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చిన సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు బాగా పని చేశారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సీఎం చంద్రబాబు ఫోన్ చేయడంతో.. ఆయా రాష్ట్రాల నుంచి విద్యుత్ సిబ్బంది ఏపీకి వచ్చారని వివరించారు.



ఏపీ క్యాబినెట్ భేటీ.. 30కిపైగా...
అజెండా అంశాలకు ఆమోదం..!!

ఐటీ, పరిశ్రమలు, రెవెన్యూ, హోంశాఖ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది

2026-31 కాలానికి ఏపీ ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పాలసీ ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర
ఏపీ పోలీసు శాఖలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటుకు అంగీకారం

ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో కొత్త విభాగం ఏర్పాటు చేయనున్నారు..
30 ఎకరాల్లో ఎఫ్ఎల్‌వో మహిళా పారిశ్రామిక పార్కుకు పచ్చజెండా ఊపింది
స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దు
ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో, 2029 ఎన్నికలు లక్ష్యంగా పని చేయాలి

సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ క్యాబినెట్ భేటీ ముగిసింది. 30కిపైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐటీ, పరిశ్రమలు, రెవెన్యూ, హోంశాఖ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. 2026-31 కాలానికి ఏపీ ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పాలసీ ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏపీ పోలీసు శాఖలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో కొత్త విభాగం ఏర్పాటు చేయనున్నారు. అన్నమయ్య జిల్లాలో 56.82 ఎకరాల్లో ఫుట్‌వేర్ కాంపోనెంట్ పార్కు ఏర్పాటుకు, ఎన్టీఆర్ జిల్లా జయంతిపురంలో 30 ఎకరాల్లో ఎఫ్ఎల్‌వో మహిళా పారిశ్రామిక పార్కుకు పచ్చజెండా ఊపింది. అదేవిధంగా

..2వ పేజీలో

ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దు..!!

మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేం.. ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దు

రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది...మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయి

పదిమంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి...శాంతిభద్రతలు క్షీణించి.. అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు

పది మంది పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది : రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్ ఆర్‌డీలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం, డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు. " రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురా యిగా మారుతాయి. పదిమంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి. శాంతిభద్రతలు క్షీణించి.. అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు. పది మంది పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది. కొంతమంది పనిగట్టుకుని నియామకాల పట్ల అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు రాజకీయంగా మాకేం కొత్త కాదు.. మీకు మాత్రం కొత్త. నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు వచ్చాయి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికే ఈ చర్యలు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయి" అని సీఎం అన్నారు.

ఏపీ క్యాబినెట్ భేటీ.. 30కిపైగా అజెండా అంశాలకు ఆమోదం..!!

(మొదటిపేజీ తరువాయి) పలు ఇంధన ప్రాజెక్టులు, వివిధ జిల్లాల్లో బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో లిథియం బ్యాటరీ మెటీరియల్ తయారీ పరిశ్రమ, రూ.4 వేల కోట్లతో కార్బన్ కార్బో సంస్థ పరిశ్రమపై మంత్రివర్గంలో చర్చ జరిగింది.

ఆమోదించిన ప్రతిపాదనల్లో కొన్ని..

విశాఖ జిల్లా భీమిలి మండలం అమనాంలో 512 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

2036 వరకు రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ పాలసీ

సెమికండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ-4.0లో సవరణలు

రాంబిల్లిలో ఈప్యాక్ డేటా సెంటర్ యూనిట్ ఏర్పాటు

విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దు: సీఎం

క్యాబినెట్ భేటీ ముగిశాక రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో, 2029 ఎన్నికలు లక్ష్యంగా పని చేయాలని చెప్పారు.

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అనుమతుల వివరాలివ్వండి

: ఏపీ, తెలంగాణకు కేఆర్ఎంబీ లేఖ

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి అసలు అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది. శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్‌లో కేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, అక్టోబర్ 16, అక్టోబర్ 30 తేదీల్లో రాసిన లేఖలకు సంబంధించిన వివరాలు కూడా ఇంకా అందలేదని లేఖలో కేఆర్ఎంబీ పేర్కొంది. 2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు, మొదట ఆమోదించిన ప్రాజెక్టు రూపకల్పనలే ప్రాథమిక ప్రాతిపదికగా కొనసాగుతాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అక్టోబర్ 15న స్పష్టం చేసినట్లు బోర్డు తెలిపింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చేసిన మార్పులు, అదనంగా చేర్చిన పథకాలు, నీటి అవసరాల పెంపు వంటి అంశాలను పరిశీలించేందుకు అసలు అనుమతుల వివరాలు అవసరమని తెలిపింది. అందుకోసం రెండు ప్రాజెక్టులకు సంబంధించి మొదట అనుమతి పొందిన పరిధి, భాగాలు... ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటి మళ్లింపు వివరాలు... నీటి వినియోగం, డిజైన్ అవసరాలు... ఆయకట్టు పరిధి, సాంకేతిక అనుమతుల పత్రాలు ఇవ్వాలని సూచించింది. రాష్ట్రాల హక్కులు, వాదనలకు భంగం కలగకుండా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు కృష్ణా బోర్డు స్పష్టం చేసింది.

భారత్‌పై విష ప్రచారం.. చైనా వ్లాగర్ల తీరుపై కేంద్రం సీరియస్..!!

(మొదటిపేజీ తరువాయి) కథనాలతో వారు విశ్వసనీయతను కోల్పోతారనే విషయం గుర్తుంచుకోవాలి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నా" అని పేర్కొన్నారు.

ట్రంప్ ఒక్క మాటతో.. భారీగా పడిపోయిన చమురు ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో చమురు మంటలు క్రమంగా చల్లారుతున్నాయి. ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో ముడి చమురు



ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా 90 డాలర్ల దిగువకు పడిపోయి మూడు నెలల కనిష్ఠానికి చేరింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 3.3 శాతం తగ్గింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.6శాతం పతనమై 84.1 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. పశ్చిమా సియాలో ఉద్రిక్తతలు సద్దుమణగొచ్చనే అంచనాలతో ఫ్యూచర్స్ మార్కెట్‌లో చమురు ట్రేడర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీంతో చమురు ధరలు దిగొస్తున్నాయి. ఇదిలా ఉండగా.. వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. "ఇరాన్ సైన్యం పూర్తిగా నిర్వీర్యమైంది. అందుకే మేం ఇక, యథాతథ స్థితిని కొనసాగించాలని అనుకుంటున్నాం. ఆ దేశంలో దాడుల అవసరం ఉండకపోవచ్చు. అయితే, ఇరాన్ అణు కార్యకలాపాలు సాగించకుండా ఆ దేశంతో దీర్ఘకాల ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నాం. కానీ, ఏ కారణం చేతనైనా పరిస్థితులు మారితే.. వాటిని ఎదుర్కొనేందుకు ఆయుధాలతో సిద్ధంగా ఉన్నాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ అణు కార్యక్రమం అంశంలో ఒప్పందం కుదిరి, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే.. మళ్లీ ఆ దేశంపై దాడులు జరిగే అవకాశాలు తక్కువంటూ అంతకుముందు మరో సమావేశంలో అధ్యక్షుడు వెల్లడించారు. దీంతో పశ్చిమాసియాలో ఘర్షణలు తగ్గొచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ అరెస్టులపై కన్నెర్ర..!!

(మొదటిపేజీ తరువాయి) కొత్త కేవైసీ మార్గదర్శకాలను స్వయంగా పరిశీలిస్తామని బెంచ్ వెల్లడించింది. తదుపరి విచారణ నవంబర్ 23కి వాయిదా వేసింది.

అప్పుడు అత్తమ్మ కోపం చూసి వణికిపోయా: సోనియా గాంధీ

ప్రధాని నరేంద్రమోదీతో తనకు సైద్ధాంతిక వైరుధ్యాలే గానీ.. వ్యక్తిగత విభేదాలు లేవన్నారు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ. ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ ' మంగళవారం విడుదలైన సంగతి తెలిసిందే. అందులో సోనియా వ్యక్తిగత, రాజకీయాలకు సంబంధించి పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

మోదీ పోరాటం అది.. నా పోరాటం ఇది.. "మోదీజీ 12 ఏళ్లుగా ప్రధాని పదవిలో ఉన్నారు. అయినప్పటికీ అధికారిక సమావేశాల్లోనే అప్పుడప్పుడు ఎదురుపడ్డాం. ఆ సమయంలో మోదీ పెద్దగా మాట్లాడరు. కేవలం నమస్తే అని పలకరించుకున్నాం. ఒకసారి నేను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 'ఎలా ఉన్నారు' అని అడిగారు. మోదీ ఈ దేశం కోసం ఆయన దృక్కోణంలో పోరాడుతుంటే.. నేను నా సిద్ధాంతాల పరంగా పోరాడుతున్నా. నా కుటుంబసభ్యుల సేవ, త్యాగం, సంప్రదాయాలు, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాల నుంచి నేను నా సిద్ధాంతాలను ఏర్పరుచుకున్నా. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల ఆలోచనలు, ఆయన పెరిగిన పరిస్థితులు, ఎదురైన అనుభవాల నుంచి మోదీ తన దృక్కోణాన్ని ఏర్పరుచుకున్నారు. ఇందులో ఎలాంటి వ్యక్తిగతం లేదు" అని సోనియా వివరించారు.

ప్రణబ్ ప్రధాని కావాలనుకున్నారు.. ఈ సందర్భంగా యూపీఏ హయాంలో తన పాత్ర గురించి కూడా సోనియా



ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని తాను వెనకుండి నడిపించానంటూ వచ్చిన విమర్శలను ఆమె తోసిపుచ్చారు. అంతేకాదు.. దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఓసారి ప్రధాని కావాలని ఆశపడినట్లు తెలిపారు. "యూపీఏ పాలనలో ఆర్థికమంత్రిగా ఉన్న చిదంబరంతో ప్రణబ్ ముఖర్జీకి ఓ సారి విభేదాలు తలెత్తాయి. 2010లో దాని గురించి ఆయన నావద్ద అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నాయకత్వాన్ని మార్చే సమయం వచ్చిందేమో అని ప్రణబ్ అన్నప్పుడు నేను ఆశ్చర్యపోయా. బహుశా ప్రధాని కావాలన్న ఆయన ఆశను అలా బయటపెట్టి ఉంటారని అర్థమైంది. కానీ నేను ఆ మాటలను పొడిగించలేదు" అని సోనియా వెల్లడించారు.

అత్తమ్మ కోపం చూసి వణికిపోయా.. తన అత్తమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో ఉన్న అనుబంధం గురించి సోనియా ఇందులో పంచుకున్నారు. ఆమెకు చాలా త్వరగా కోపం వస్తుందని, మొదట్లో తాను ఎంతగానో భయపడిపోయినట్లు రాసుకొచ్చారు. "ఓసారి సిబ్బంది ఒకరు ముఖ్యమైన అపాయింట్ మెంట్ గురించి చెప్పడం మర్చిపోవడంతో అత్తమ్మ ఆగ్రహించారు. ఆ వ్యక్తిని గదిలో మూలన నిలబెట్టారు. మరోసారి డైనింగ్ టేబుల్‌పై ప్లేట్ విసిరేశారు. అది చూసి నేను కూర్చున్న చోటే వణికిపోయా. రాజీవ్, సంజయ్ మాత్రం మౌనంగా చూస్తూ ఉన్నారు. 'భయపడకు.. అమ్మ కోపం క్షణకాలం' అని అప్పుడు రాజీవ్ నాతో అన్నారు. అత్తమ్మ గురించి పూర్తిగా తెలుసుకున్నాక.. ఆమె ఏంటో నాకు అర్థమైంది. ఆమెకు చీరలంటే చాలా ఇష్టం" అని సోనియా వివరించారు.

సంపాదకీయం

సీనియర్ ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ మరోసారి పొడిగింపు

అమరావతి: నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణల కేసులో 1996 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ ఎన్.సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ 2027 మార్చి 31 వరకు లేదా అతనిపై ఉన్న క్రిమినల్ విచారణ ముగిసే వరకు సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1969లోని రూల్ 3(1) ప్రకారం 2024 డిసెంబర్ 3న సంజయ్‌ను తొలిసారిగా సస్పెండ్ చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ- అగ్నిమాపక సేవల విభాగం డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన కాలంలో అగ్ని-చీజ- వెబ్ పోర్టల్ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించిన ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడం, నిధుల దారిమళ్లింపునకు పాల్పడటం వంటి ఆరోపణలున్నాయి. ఏపీ సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసిన సమయంలో.. ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కులు, పీఓఏ చట్టం-1989పై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించే శిక్షణ కోసం కేటాయించిన నిధులను సొంతానికి వాడుకుని భారీగా అవినీతికి పాల్పడటం వంటి అభియోగాలపై కేసు నమోదైంది. సంజయ్ సస్పెన్షన్ గడువు ముగియనున్న తరుణంలో ప్రభుత్వ సమీక్షా కమిటీ ఈనెల 6న ప్రత్యేకంగా సమావేశమై భద్రతా అంశాలను పరిశీలించింది. విజయవాడ ఏసీబీ 2024 డిసెంబర్ 24న నమోదు చేసిన కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరికొంతమంది కీలక సాక్షులను విచారించాల్సి ఉందని, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు రావాల్సి ఉందని ఏసీబీ డీజీ నివేదించారు. ఐపీఎస్ క్యాడర్‌లో సంజయ్ అత్యున్నత హోదాలో ఉన్న వ్యక్తి కావడంతో.. ఇప్పుడు సస్పెన్షన్‌ను రద్దు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని, దర్యాప్తును ప్రభావితం చేస్తారని సమీక్షా కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 3(3)లోని విచక్షణాధికారాలను ఉపయోగించి, సంజయ్ వయోపరిమితి ప్రకారం రిటైర్ అయ్యే 2027 మార్చి 31వ తేదీ వరకు సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంలో తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.



పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ.. కరువు నేలలో కాసులు కురిపిస్తున్న రైతన్న

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. అలాంటి ఓ పంట గురించి ఇప్పుడు మేం చెప్పబోతున్నాం.. మీకు జస్ట్ ఎకం పొలం ఉన్నా సరే మీరు ఈపంటతో లక్షల్లో సంపాధించవచ్చు. కానీ ఇందుకు కాస్త ఓపిక అవసరం.. దీర్ఘకాలంలో ఈ పంట మీకు అద్భుత విజయాన్ని అందిస్తుంది. అదే అవకాడో సాగు.. దేశంలోనే తొలిసారిగా 2 ఎకరాలలో అవకాడో సాగుచేస్తూ అద్భుత విజయాన్ని అందుకున్న ఈ అనంతపురం రైతు గురించి ఇక్కడ తెలుసుకుందాం.

ఉద్యాన పంటల సాగుకు పెట్టింది పేరైన అనంతపురం జిల్లా రైతులు మరోసారి తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా వినూత్న పంటలను



సాగు చేస్తూ మంచి దిగుబడులతో అధిక ఆదాయం ఆర్జిస్తున్న ఇక్కడి రైతుల బాటలోనే, కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రమణ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రాయలసీమ ప్రాంతానికే సరికొత్తదైన అవకాడో పంటను రెండెకరాల్లో పండిస్తూ.. ఆయన లక్షల సంపాదిస్తున్నారు. రాయలసీమ రైతులు సాంప్రదాయేతర పంటల వైపు మొగ్గు చూపడం ఇదే మొదటిసారి కాదు. గతంలో డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్, ఖర్జూరం వంటి అరుదైన పంటలను ప్రయోగాత్మకంగా పండించి మంచి ఫలితాలు సాధించారు. ప్రస్తుతం మెకాడెమియా, అవకాడో వంటి కొత్త పంటలపై దృష్టి సారిస్తున్నారు. అయితే, ఒక కొత్త పంట స్థానిక వాతావరణానికి అనుకూలించి పూర్తిస్థాయి దిగుబడి ఇవ్వడానికి కనీసం 2 నుంచి 3 సంవత్సరాల సమయం పడుతుంది కాబట్టి, రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని, తగిన ఓపిక, అధ్యయనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. ఈ సూత్రాన్ని నమ్ముకున్న రైతు రమణకు మంచి ఫలితం దక్కింది. అయితే ఈ రైతు అవకాడో సాగు ప్రయాణం చాలా ఆసక్తికరంగా సాగింది. ఈ పంట వేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఆయన కర్ణాటకలోని తొంటికొప్ప ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలను సంప్రదించారు. అయితే, రాయలసీమ వాతావరణ పరిస్థితులకు ఈ పంట ఎంతవరకు అనుకూలిస్తుందో పూర్తి భరోసా వారు ఇవ్వలేకపోయారు. ప్రయోగాత్మకంగా కేవలం 5 మొక్కలు నాటి పరిశీలించాలని సూచించారు. కానీ, అంత సమయం వేచి ఉండలేక ఆ రైతు ఏకంగా 250 అవకాడో మొక్కలను నాటారు. కొత్త పంటల్లో సహజంగా జరిగే పరిణామాల రీత్యా మొదటి 3 సంవత్సరాలు ఆయనకు ఎటువంటి దిగుబడి రాలేదు.

కరవు నేలలో కాసుల పంట... తరచూ కరువు పరిస్థితులను ఎదుర్కొనే రాయలసీమ వాతావరణంలో అవకాడో వంటి పంటను సాగు చేయడం అత్యంత సవాలుతో కూడుకున్న పని. అయినప్పటికీ ఆయన పట్టుదల, శ్రమతో ఈ ప్రయోగం అనూహ్య విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఆయన పొలంలో కాసిన అవకాడో కాయలు అద్భుతమైన నాణ్యత, పెద్ద పరిమాణంతో ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా బయట మార్కెట్‌లో లభించే చిన్న కాయలతో పోలిస్తే, ఇక్కడ ఒక్కో కాయ దాదాపు 800 గ్రాముల వరకు బరువు తూగుతుండటం విశేషం. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని అందించే సామర్థ్యం ఈ పంటకు ఉండటంతో, రమణ సాధించిన ఈ విజయం అనంతపురం జిల్లాలోని ఇతర రైతులకు గొప్ప స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కొత్త పంటల సాగులో ఆచరణాత్మక పరిశీలన, సాహసం, ఓపిక ఎంతటి కీలక పాత్ర పోషిస్తాయో రమణ అనుభవం స్పష్టం చేస్తోంది.

ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం అందించాలి

అర్హులందరికీ నిష్పక్షపాతంగా పంపిణీ చేయాలి

- మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ

ఆళ్లగడ్డ, నవంబరు 10, అమరావతి వెలుగు : పేద ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ కోరారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్‌లోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం విక్రయ కేంద్రా న్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం నాణ్యతను తనిఖీ చేసి, రేషన్ కార్డులు కలిగిన అర్హులైన పేద కుటుంబాలందరికీ ఎలాంటి వివక్షకు తావులేకుండా బియ్యం పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కి లో సన్న బియ్యం రూ.50 చొప్పున 26 కిలోల బస్తాను రూ.1,300కు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు.ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించిన ఈ సదుపాయాన్ని నియోజకవర్గంలోని అర్హులైన పేద ప్రజలు వినియోగించుకోవాలని మైలేరి సురేఖ విజ్ఞప్తి చేశారు.



జనగణనలో తప్పులకు తావులేకుండా పక్కా ప్రణాళికతో

ముందుకు సాగాలి

అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు, నవంబరు 10, అమరావతి వెలుగు : జనగణన సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి కచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్

హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జనగణనలో సేకరించే వివరాలు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానపరమైన నిర్ణయాలకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు.మంగళవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జనాభా గణన-2027పై జిల్లా సెన్సెస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగణన ప్రశ్నావళిలోని 1 నుంచి 40 ప్రశ్నలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ప్రశ్నకు ఒకే ప్రామాణిక విధానంలో సమాధానాలు నమోదు చేయాలని, సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఇంటింటి సర్వే, రివిజనల్ రౌండ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. 2027 జనవరి 10 నుంచి 24 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ ద్వారా వివరాల నమోదు, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. డిజిటల్ విధానంలో జనగణన జరుగుతున్నందున వివరాల నమోదు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఒకసారి సమర్పించిన వివరాలను సవరించే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. డేటా కచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ప్రతి కార్యాలయంలో ప్రత్యేక వెరిఫికేషన్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలు, టిడ్కో గృహ సముదాయాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని తెలిపారు. కుల, మత వివరాల నమోదులో ప్రభుత్వ నిబంధనలు, గెజిట్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తహసీల్దార్లు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.సర్వేకు కేటాయించిన సిబ్బంది విధులకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షక అధికారులు చర్యలు తీసుకోవాలని, మొదటి రెండు మూడు రోజుల్లోనే ప్రతి ఎన్యుమరేటర్ సర్వే ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయ్ కుమార్, అదనపు కమిషనర్ హిమబిందు, సీపీఓ లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాతకు ప్రత్యేక శిక్షణ..

వికాస్ విద్యాసంస్థల్లో హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్

కర్సివ్ రైటింగ్‌లో మెలకువలు నేర్చుకున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు

చిలకలూరిపేట, నవంబరు10, అమరావతి వెలుగు : విద్యార్థుల్లో అందమైన చేతిరాతతో పాటు ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందించేందుకు చిలకలూరిపేట పట్టణంలోని వికాస్



విద్యాసంస్థలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. నవంబర్ 10, 11 తేదీల్లో పెదనందిపాడు రోడ్ క్యాంపస్‌తో పాటు సుబ్బయ్యతోటలోని విఐఐటి ది స్కూల్‌లో హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్‌ను ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయి బెస్ట్ క్యాలిగ్రాఫర్ అవార్డు గ్రహీత వై. మల్లికార్జునరావు ముఖ్య శిక్షకుడిగా హాజరై విద్యార్థులకు కర్సివ్ రైటింగ్‌లోని మెలకువలను వివరించారు. అక్షరాలను అందంగా, స్పష్టంగా, వేగంగా రాసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ కర్సివ్ రైటింగ్ సాధనతో పరీక్షల్లో సమయం ఆదా కావడమే కాకుండా ఏకాగ్రత, అంకితభావం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు స్పష్టమైన చేతిరాతను అలవర్చుకోవడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వికాస్ స్కూల్స్ డైరెక్టర్ దండా పవన్ కుమార్ మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి ప్రతి ఏటా నిపుణులతో హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని డైరెక్టర్లు దండా పవన్ కుమార్, రోజశ్రీ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.

పుట్టపర్తి రైతు బజార్ పనులు....

వేగవంతం చేయాలి: కలెక్టర్

పుట్టపర్తి, నవంబరు 10, అమరావతి వెలుగు :







శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలోని కర్ణాటకనాగేపల్లిలో నిర్మిస్తున్న నూతన రైతు బజార్ పనులను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులు, వినియోగ దారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బోరుబావిలో ఇసుక పూడిక చేరడంతో మోటారు పనిచేయడం లేదని గుర్తించి, మున్సిపాలిటీ ద్వారా తక్షణమే రెండు మూడు తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో భూగర్భ నీటి సంపు నిర్మించి, మరుగుదొడ్లపై ఏర్పాటు చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు నిరంతరం నీటి సరఫరా



జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బజార్ ఆవరణలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ప్రతి షెడ్డు మధ్యలో ప్రజల రాకపోకలకు అనువుగా పేవర్ రాళ్లు వేయాలని ఆదేశించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన సెమీ స్ట్రక్చర్ వేదికలను ఇసుకతో నింపి, చదును చేసే పనులను వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ హాఫిజుల్లా, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

19న ఎంపీపీలు.. 20న జెడ్పీ చైర్మన్ల ఎన్నికలు

పుట్టపర్తి, నవంబరు 10, అమరావతి వెలుగు : మండల ప్రజా పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పరోక్ష ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసినట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14వ తేదీలోగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19న మండల పరిషత్‌లలో ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకు, 20న జిల్లా పరిషత్‌లలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ఎన్నికల రోజున ఉదయం తొలుత మండల పరిషత్‌లలో ఒక్కొక్కరు చొప్పున, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు చేతులెత్తే పద్ధతిలో నిర్వహిస్తారని వివరించారు. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరోక్ష ఎన్నికల్లో ఎక్స్-అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు ఉండదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

జడ్పీటీసీ, ఎంపీపీని మర్యాదపూర్వకంగా

కలిసిన బీజేపీ నేతలు

నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు

పెనుకొండ, నవంబరు10, అమరావతి వెలుగు : మండలంలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ కేశవయ్య యాదవ్, ఎంపీపీ దండు ఈశ్వర్‌తో పాటు ఎంపీపీ అభ్యర్థి మమత ప్రసాద్‌ను



బీజేపీ నాయకులు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రామకృష్ణతో పా టు పలువురు నాయకులు, కార్యకర్త లు వారికి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అనంతరం పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకుంటూ అభినందనలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

పెనుకొండ, సోమందేపల్లి జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులకు బీసీ సంక్షేమ సంఘం అభినందనలు

పెనుకొండ, నవంబరు10, అమరావతి వెలుగు : నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. పెనుకొండ



మండల రూరల్ జడ్పీటీసీగా ఎన్నికైన యశోద కేశవయ్య, రూరల్ ఎంపీపీగా ఎన్నికైన దండు మమతా ఈశ్వర్ ప్రసాద్‌లను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సోమందేపల్లి మండల జడ్పీటీసీగా ఎన్నికైన జయంతి సిద్ధలింగప్పను ఆయన స్వగ్రామమైన మేకలపల్లిలో శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో తాళ్లపూడి విద్యార్థి ప్రతిభ

థాయిలాండ్‌లో జరిగిన జంప్ రోప్ పోటీల్లో ద్వితీయ స్థానం.. అంతర్జాతీయ స్థాయికి ఎంపిక

తాళ్లపూడి, నవంబరు 10, అమరావతి వెలుగు : క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయిని సీహెచ్. సుబ్బలక్ష్మి అన్నారు. తాళ్లపూడిలోని పరస పద్మ రాజారావు ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న శంకరపు భార్గవ్ సూర్య జంప్ రోప్ క్రీడలో ప్రతిభ చాటాడు. థాయిలాండ్‌లో జరిగిన జాతీ య స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకార ణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా భార్గవ్ సూర్యను షీల్డ్, దుశ్శాలువా, బహుమతులతో ఘనంగా సత్కరించారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కేశవ, స్నేహ దీపికలకు కూడా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ గుండుబోగుల పద్మకుమారి, వ్యాయామ ఉపాధ్యాయిని ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు

గృహహింస, మద్యపానం వల్ల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాటిక ద్వారా చైతన్యం

పెనుకొండ, నవంబరు 10, అమరావతి వెలుగుమహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, చట్టాలు కల్పించిన రక్షణను వినియోగించుకోవాలని పలువురు నిర్వాహకులు సూచించారు. టింబక్టు కలెక్టివ్ ఆర్థిక సహకారంతో మహాశక్తి ఆధ్వర్యంలో పెనుకొండ మండలం కోనాపురం గ్రామంలో మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షురాలు టి. ముంతాజ్, సీఈఓ జ్ఞానేశ్వరి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దుర్గాశక్తి సొసైటీ పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో 9,697 మంది సభ్యులతో పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధితో పాటు వారి హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా గృహహింస, మద్యపానం కారణంగా కుటుంబాల్లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి ప్రభావాలను వివరిస్తూ టీమ్ సభ్యులు నాటిక ప్రదర్శించారు. మహిళలకు చట్టపరంగా లభించే హక్కులు, అన్యాయాలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.



ఈ కార్యక్రమంలో దుర్గాశక్తి సొసైటీ పాలకవర్గ సభ్యులు, టీమ్ సభ్యులు, స్వశక్తి ప్రోగ్రామ్ మేనేజర్ గౌరీ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది మహిళలు హాజరై అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

పుట్టపర్తిలో 100 శివలింగాలు, 100 కలశాలు, 100 జ్యోతులతో విశ్వశాంతి ర్యాలీ..

సత్యసాయి ప్రేమ, సత్యం, శాంతి సందేశం విశ్వమానవాళికి ఆదర్శం: సిస్టర్ బీకే శివాని







పుట్టపర్తి, నవంబరు 10, అమరావతి వెలుగు : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తిలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 100 శివలింగాలు, 100 కలశాలు, 100 జ్యోతులతో విశ్వశాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వకళ్యాణి భవన్ నుంచి హనుమాన్ సర్కిల్ మీదుగా ప్రశాంతి నిలయం వరకు భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. అనంతరం సాయి కుల్వంత్ సభామందిరంలో సత్యసాయి బాబా మహాసమాధి వద్ద 100 శివలింగాలు, కలశాలు, జ్యోతులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, విశ్వశాంతి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రేరణాత్మక వక్త సిస్టర్ బీకే శివాని మాట్లాడుతూ ప్రశాంతికి నిలయమైన ప్రశాంతి నిలయం సర్వమత సమైక్యతకు, విశ్వమానవ ప్రేమకు ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. భగవాన్ సత్యసాయిబాబా ప్రపంచానికి అందించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అనే మానవతా విలువలు మానవాళికి శాశ్వత మార్గదర్శకాల న్నారు. ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో ప్రేమను నింపుకొని, ఆలోచనల్లో పవిత్రతను, చేతల్లో సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. లవ్ ఆల్ - సర్వ్ ఆల్ (అందరినీ ప్రేమించండి - అందరికీ సేవ చేయండి), హెల్ప్ ఎవర్ - హర్ట్ నెవర్ (ఎల్లప్పుడూ సహాయం చేయండి - ఎవరినీ బాధించకండి) అనే సత్యసాయి సందేశాలను జీవితంలో ఆచరించాలని సూచించారు. మానవసేవే మాధవసేవ అన్న బాబా బోధన విశ్వశాంతికి పునాది అని, ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయని సిస్టర్ శివాని విశేషంగా వివరించారు.

పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు

కేబినెట్ ఆమోదం

పెనుకొండ, నవంబరు 10, అమరావతి వెలుగు : స్థానిక యువతకు వృత్తి, సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కళాశాల ఏర్పాటుకు పెనుకొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1245-1లో రెండు ఎకరాల భూమిని కేటాయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. మంత్రి సవిత చేసిన కృషి ఫలితంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె కార్యాలయం వెల్లడించింది. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు స్థానికంగానే వృత్తి, సాంకేతిక విద్యలో శిక్షణ పొందే అవకాశం కలగనుంది. పెనుకొండలోని కియా పరిశ్రమతో పాటు అనుబంధ పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కళాశాల ద్వారా పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల విద్యార్థులకూ ప్రయోజనం చేకూరనుంది. 2029 నాటికి 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సవిత తెలిపారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రివర్గ సహచరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఉపాధి హామీ పనులు గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్

పుట్టపర్తి, నవంబరు 10, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఫారంపాండ్లు, కందకాలు, నీటి నిల్వ నిర్మాణాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యాలయ సిబ్బంది హాజరు, ఈ-ఆఫీస్ ఫైళ్ల పురోగతి, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు వాటర్‌షెడ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటే కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు తావులేకుండా సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఏపీవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికల నామినేషన్లలో నిష్పక్షపాతంగా

వ్యవహరించాలి: కలెక్టర్

అనంతపురం సవంబరు10, అమరావతి వెలుగు : గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలు-2026లో నామినేషన్ల ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా





నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ సూచించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడం, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తుది జాబితా ఖరారు, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు వంటి బాధ్యతలను రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న కొన్ని ఘటనలను దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, కల్యాణదుర్గం, అనంతపురం, గుంతకల్లు డీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు కంచి రంగప్ప మృతి..

ఏ.కొత్తపల్లిలో విషాదఛాయలు

అమడగూరు, నవంబరు10, అమరావతి వెలుగు : మండల పరిధిలోని ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కంచి అలియాస్ వలిపి రంగప్ప (58) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. చిన్నతనం నుంచే గ్రామంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న రంగప్పకు ఒక కుమారుడు ఉన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి తనదైన సేవలందిస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించిన ఆయన మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కన్నీరుమున్నీరయ్యారు. రంగప్ప మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, గ్రామ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హౌస్ అరెస్ట్

అనంతపురం సవంబరు10, అమరావతి వెలుగు : కళ్యాణదుర్గంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జరిగిన ఘటనలను నిరసిస్తూ మాజీ ఎంపీ రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న నిరసన ర్యాలీకి వెళ్లేందుకు బయలుదేరిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని పోలీసులు ఆయన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించ లేకపోయిందని విమర్శించారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు పలు చోట్ల దౌర్జన్యాలు జరిగాయని, ఓట్ల లెక్కింపు సమయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కౌంటింగ్ కేంద్రాలకు బౌన్సర్లను తీసుకొచ్చి దాడులు చేశారని, ఈ ఘటనలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు.



కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై తిరిగి రీకౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై నిజంగా విశ్వాసం ఉంటే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తాను గతంలో చేసిన రాజకీయ సన్యాసం ప్రకటనకు కట్టుబడి ఉన్నానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎన్నికలకు సిద్ధమా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సవాల్ విసిరారు. అనంతపురంలోనూ పోలింగ్ సందర్భంగా బూత్ క్యాప్చరింగ్, గొడవలు జరిగాయని ఆరోపిస్తూ, అవసరమైతే అక్కడి ఎన్నికలను కూడా రద్దు చేసి తిరిగి నిర్వహించాలని అన్నారు. గత ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగానే జరిగాయని, అందుకే వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారని పేర్కొన్నారు.

19న ఎంపీపీలు.. 20న జడ్పీ చైర్మన్ల ఎన్నికలు

అమరావతి, నవంబరు 10, అమరావతి వెలుగు : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీపీలు, జిల్లా పరిషత్ అధ్యక్షుల పరోక్ష ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 19న రాష్ట్రంలోని 659 మండల పరిషత్‌లలో ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించ నున్నారు. 20న 28 జిల్లా పరిషత్‌లలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలుత మండల పరిషత్‌లలో ఒక్కొక్కరు, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు ఉండదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఎన్నికల వేళ సున్నిత గ్రామాల్లో

పోలీసుల నిఘా..

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

అనంతపురం, నవంబరు 10, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శింగనమల మండలం నాగులగుడ్డం తండా సున్నిత గ్రామాన్ని ఎస్పై ప్రసాద్ సందర్శించి గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలు పాటించాల్సిన నియమాలు, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామంలో అల్లర్లు, గొడవలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సున్నిత గ్రామాల్లో నిరంతర పోలీసు నిఘాతో పాటు ఫుట్ పెట్రోలింగ్ కొనసాగుతుందని ఎస్పై ప్రసాద్ తెలిపారు.



కళ్యాణదుర్గం ఎన్నికల ఫలితాలపై

రీ కౌంటింగ్ నిర్వహించాలి

అనంతపురం, నవంబరు 10, అమరావతి వెలుగు : కళ్యాణదుర్గంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జరిగిన దౌర్జన్యకాండను నిరసిస్తూ మంగళవారం మాజీ ఎంపీ రంగయ్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. నామినేషన్ల దశ నుంచి పోలింగ్ వరకు అధికార వ్యవస్థలను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయినప్పటికీ గెలుపుపై నమ్మకం లేక కౌంటింగ్ సమయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కౌంటింగ్ కేంద్రాలకు బౌన్సర్లను తీసుకువచ్చి దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల ఫలితాలపై మరోసారి రీ కౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, సీపీఐ నాయకుడు జగదీష్, ఉమామహేశ్వర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



19న ఎంపీపీలు.. 20న జడ్పీ చైర్మన్ల ఎన్నికలు

అనంతపురం, నవంబరు 10, అమరావతి వెలుగు : మండల ప్రజా పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పరోక్ష ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఈ నెల 14వ తేదీలోగా ప్రత్యేక సమావేశాల నోటీసులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న మండల పరిషత్‌లలో ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకు, 20న జిల్లా పరిషత్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల రోజున తొలుత మండల పరిషత్‌లలో ఒక్కొక్కరు చొప్పున, జిల్లా పరిషత్‌లో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారని వివరించారు. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ పరోక్ష ఎన్నికల్లో ఎక్స్-అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు ఉండదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పరిగిలో నేడు వైఎస్సార్‌సీపీ

ఆత్మీయ సమావేశం

ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో ముఖాముఖి

పరిగి, నవంబరు 10, అమరావతి వెలుగు : మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారశీ నేడు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది.ఈ సందర్భంగా మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, పంచాయతీ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ బి.కె. నరసింహమూర్తి పిలుపునిచ్చారు. బోరెడ్డిపల్లి సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు పార్టీ కుటుంబ సభ్యులంతా చేరుకుని సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576